
సాక్షి గుంటూరు

గురువారం । 4 । జనవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

పట్నంబజారు: సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం బుధవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 19,845, ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రేషన్ పంపిణీ పరిశీలన



నరసరావుపేట రూరల్: వలంటీర్లు రేషన్ వాహనం వెంట ఉండి సరుకులు పంపిణీ పర్యవేక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇక్కుర్రులో రేషన్ పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వర ఆలయానికి పూజిత డాల్ మిల్లర్స్ నిర్వాహకులు భారీ విరాళం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.10లక్షలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాతల్ని శాలువాలతో సత్కరించారు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న పూజిత భాగస్వాములైన చందోలు మల్లికార్జున కుటుంబసభ్యుల్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులిపాటి రామారావు, పెండేల పుల్లారావు, మాల్యాద్రి, రెడ్డి నగేష్‌బాబు, జాగర్లమూడి సుబ్బారావు, గంధం బాలిరెడ్డి, దండు చెన్నయ్య, నాగపవన్‌కుమార్, ములకా రామతులసీరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన మంత్రి నాగార్జున



ఏఎన్‌యూ : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ప్రొఫెసర్ మేరుగ నాగార్జున బుధవారం వర్సిటీని సందర్శించారు. ఆయనకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని వీసీ వివరించారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని, రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాల్లో ఏఎన్‌యూ ముందు వరుసలో నిలుస్తుందని మంత్రికి తెలియజేశారు. విశ్వవిద్యాలయాల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఆచార్య కె మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్. బి నాగరాజు, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్.ఉదయ్ కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్ తదితరులు మంత్రిని కలిశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ 'నావెల్ ప్రాసెస్ అండ్ థైర్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై ఫిబ్రవరి 23, 24 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యల్లో పర్యావరణ, మొక్కలు దిగుబడి, అడవుల సంరక్షణ, క్యాన్సర్, డయాబెటిస్, ఏజింగ్, అల్జీమర్స్ వ్యాధుల మీద ప్రఖ్యాత శాస్త్రవేత్తల ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు, అధ్యాపకులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్‌ఎన్ రాజు, డాక్టర్ కే బాబు, డాక్టర్ కే నాగరాజు, డాక్టర్ కే విజయ్ కుమార్, జ్యోతి ఆదిత్య పాల్గొన్నారు.

యార్డుకు 59,321 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 59,321 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 57,983 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 34,701 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

చిరునవ్వులు కురిపింఛెన్

- మనసున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి
- పెన్షన్ పెంపుదల వారోత్సవ సభలో వైద్యశాఖ మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు పింఛన్ కానుక చెక్కును అందజేస్తున్న మంత్రి విడదల రజిని, జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి , జేసీ రాజకుమారి

పాత గుంటూరు: లబ్ధిదారులకు ప్రతి నెలా మొదటి తేదీ ఉదయమే చిరునవ్వుతో వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3000ను ఇంటి ముంగిటకే అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమల్లో దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల వారోత్సవాలలో ఆమెతో పాటు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, మేయరు కావటి మనోహరనాయుడు పాల్గొన్నారు. సభకు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అధ్యక్షత వహించారు.

ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనం

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను దశల వారీగా రూ.3000 వరకు పెంచినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు నెలల వరకు రూ.1000 పెన్షన్‌ను రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మందికి మాత్రమే అందించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రూ.2250కి పెంచారన్నారు. ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంవత్సరాల్లో రూ.3000 పెంచి 66.34 లక్షల మందికి పెన్షన్‌ను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పెన్షన్లకు రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.2000 కోట్లు ఖర్చు చేస్తున్నదంటే.. పేదల సంక్షేమంపై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుకను అందిస్తోందని తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 60,436 మందికి ప్రతి నెలా రూ.18.23 కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 5,86,573 మందికి రూ.165.5293 కోట్లను ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తోందని చెప్పారు. వీటిలో వృద్ధాప్య పెన్షన్లు 2,86,264, వితంతు పెన్షన్లు 1,88,859, వివిధ ప్రతిభావంతులు పెన్షన్లు 65,082, ఒంటరి మహిళలు 34,403 మంది ఉన్నట్లు ఆమె వెల్లడించారు. కిడ్నీ డయాలసిస్ రోగులకు రూ. 10,000, వివిధ దీర్ఘకాలిక రోగులకు రూ.3000 నుంచి రూ.10,000 వరకు అందిస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ మేయరు కావటి శివనాగ మనోహర నాయుడు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలుకు, లబ్ధిని ఇంటి వద్దకే వచ్చి అందించటానికి దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 25,966 మందికి రూ.7.84 కోట్లు, పశ్చిమ నియోజకవర్గంలో 23,124 మందికి రూ.6.98 కోట్లు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి 11,346 మందికి రూ.3.41 కోట్లు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. జనవరి నుంచి రూ.3000 పెన్షన్‌తో పాటు, అదనంగా 805 మందికి నూతనంగా మంజూరు చేసినట్లు తెలిపారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేస్తూ, ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి దశల వారీగా పెంచుతూ రూ. 3000 చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే ముస్తఫా

మంగళగిరి కళనేతకు కేంద్రం గుర్తింపు

జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక అవార్డు



ప్రత్యేక అవార్డుతో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మంగళగిరి చీరకు కేంద్రం గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద మంగళగిరి శారీ, ఫ్యాబ్రిక్‌కి అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా మొత్తం 580 కేటగిరిలు పోటీ పడగా అందులో 60 షార్ట్‌లిస్ట్ చేశారు. పది కేటగిరిలకు అవార్డులు అందించారు. అందులో గుంటూరు జిల్లా మంగళగిరి చీరకు అవార్డు దక్కింది. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి బుధవారం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్‌శంకర్ చేతుల మీదుగా ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర భారత్ పథకంలో భాగంగా వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరి చేనేతకు ఊపిరి పోసింది. మంగళగిరిలో సుమారు రెండు వేల మంది చేనేత కార్మికులున్నారు. వీరంతా మగ్గాలపై చీరలు నేసి వివిధ షాపులకు వేసి అమ్మకాలు జరుపుతుంటారు. వారందరికీ ఒకేచోట మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు చేపట్టడంతో పాటు, వ్యాపార అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో భాగంగా మంగళగిరి రాజీవ్ గృహకల్ప వద్ద 197 మగ్గాల షెడ్లు ప్రభుత్వం నిర్మించింది. ఈ కార్యక్రమం వల్ల మంగళగిరిలోని సుమారు రెండు వేల చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి లభించింది. చేనేత జౌళి శాఖ నుంచి కొంత మొత్తం, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మరికొంత నిధులు కేటాయించి చేనేత వస్త్ర ఉత్పత్తి కేంద్రాల్ని నిర్మించింది. వీటికి చేనేత ప్రముఖుల పేర్లతో నామకరణం చేసింది. మగ్గం నేసే నేతన్నతో పాటు చేనేత అనుబంధ వృత్తులు రంగుల అద్దకం, ఆసుతోడటం, పడుగు చేయడం, అచ్చులు అతకడం, మొలకట్టడం, మగ్గం నేయడం, హోల్‌సేల్ మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్‌లతో ఆయా కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. దీనికి కావాల్సిన ముడి సరుకును కూడా 15 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోంది. మంగళగిరి ఉత్పత్తులకు ప్రాచుర్యంతో పాటు మార్కెటింగ్ ఏర్పాటు కోసం కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో దీనికి ఒక స్టాల్ కేటాయించారు. ప్రతి మంగళవారం జరిగే స్పందనతో పాటు చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించి మంగళగిరి చీరకు గుర్తింపు వచ్చేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలోని 580 కేటగిరిలతో పోటీ పడి మంగళగిరి చీర అవార్డును సొంతం చేసుకుంది.

మంత్రి కార్యాలయంపై దాడిచేసిన మరో తొమ్మిది మంది అరెస్టు

గుంటూరు ఈస్ట్ : చంద్రమౌళీనగర్‌లోని మంత్రి విడదల రజిని నూతన కార్యాలయంపై దాడి చేసిన తొమ్మిదిమందిని పట్టాభిపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 31వ తేదీ అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు మంత్రి విడదల రజిని కార్యాలయంపై రాళ్లు రువ్విన సంఘటన తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే 25 మందిని అరెస్టు చేశారు. బుధవారం మరో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

12లోగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించండి

అధికారులకు జేసీ రాజకుమారి ఆదేశం


గుంటూరు వెస్ట్: జిల్లాలో ఎస్‌ఎస్‌ఆర్–2024 డ్రాఫ్ట్ జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ నెల 12లోపు సక్రమంగా విచారించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన ఎన్నికల నిబంధనలపై అధికారులకు అవగాహన ఉండాలని చెప్పారు. ఇప్పటి వరకు అందిన అభ్యంతరాల్లో ఫామ్–7లో 481, ఫామ్–8లో 605 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందన్నారు. నిర్దేశిత గడువులోపు వీటిని పరిష్కరించాలని జేసీ చెప్పారు. ఈ నెల 22న ఫైనల్ పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటర్ల అవగాహన కోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏడు ఈవీఎంల డెమానుస్ట్రేషన్ ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతోపాటు ఏడు ఈవీఎంల మొబైల్ వ్యాన్ల ద్వారా కూడా సిబ్బంది జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అరుణకీలాద్రి

జై భవానీ.. జైజై భవానీ



దుర్గమ్మ దర్శనం అనంతరం ఇరుముడుల సమర్పణకు కొండదిగి వస్తున్న భవానీ మాలధారులు



విద్యుత్ దీపాల వెలుగుల్లో శోభిల్లుతున్న దుర్గగుడి



అగ్నిప్రతిష్టాపన చేస్తున్న చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు, అర్చకులు

- వైభవంగా ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ
- తొలి రోజే భారీగా తరలివచ్చిన భవానీ భక్తులు
- అగ్నిప్రతిష్టాపన చేసిన ఆలయ చైర్మన్, ఈవో
- నిరంతరం పర్యవేక్షణతో భవానీల సంతృప్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రి అరుణ వర్ణాన్ని సంతరించుకుంది. దీక్షల విరమణకు పోటెత్తిన భవానీ మాలధారులతో కిటకిటలాడింది. 'జై భవానీ.. జైజై భవానీ'.. నామ స్మరణతో అమ్మ ఆలయ ప్రాంగణం మారుమోగింది. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ బుధవారం ప్రారంభమైంది. మండల దీక్షలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూర్తిచేసిన భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించారు. కొండ దిగువన హోమ గుండంలో నేతి కొబ్బరి కాయలను సమర్పించి దీక్షలను పరిపూర్ణం చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భవానీల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. దీక్షల విరమణ తొలి రోజే సుమారు 60 వేల మంది భవానీలు ఇంద్రకీలాద్రికి విచ్చేశారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

యాగశాలలో చండీయాగం

భవానీ దీక్షల విరమణను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఐదు రోజుల పాటు చండీయాగం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చండీహోమం నిర్వహించగా, ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన

దీక్షల విరమణ తొలి రోజే భవానీలు భారీగా తరలిరావడంతో దేవస్థానం, పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఉదయం ఆరు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రద్దీ ఒకే రీతిన కొనసాగింది. మధ్యాహ్నం నుంచి రెండు గంటల నుంచి సాయంత్రం వరకు రద్దీ కాసంత తగ్గినా, సాయంత్రం తిరిగి రద్దీ పెరిగింది. ఉదయం భవానీల రద్దీ అధికంగా ఉండటంతో డీఐజీ విశాల్ గున్ని, దేవస్థాన ఈఓ రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి, ఆలయ ఈఈలు కోటేశ్వర రావు, ఎల్.రమాదేవి మహా మండపం వద్దకు చేరుకున్నారు. మహా మండపం వద్ద ఏర్పాటు చేసిన ఇరుముడి సమర్పించే పాయింట్లు నిండిపోయి భవానీలు అధిక సమయం వేచి ఉండాల్సి ఉండటంతో రిటైనింగ్ వాల్ ఎదుట ఏర్పాటు చేసిన టెంట్‌లోని మరో పాయింట్‌ను ప్రారంభించారు. ఆలయ అర్చకులు హుటాహుటిన నాల్గో హోమగుండంలో కూడా అగ్ని ప్రతిష్టాపన చేసి అక్కడ కూడా భవానీలు నేతి కొబ్బరి కాయలను సమర్పించుకునే అవకాశం కల్పించారు. మరో వైపు గోశాల వద్ద ఏర్పాటు చేసిన మూడో హోమ గుండం వద్ద భవానీల రద్దీ కొనసాగింది. గోశాల వద్ద హోమగుండం సమీపంలోనే ఉచిత ప్రసాద వితరణ జరుగుతుండటంతో భవానీలు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం గమనించిన ఆలయ ఈఓ రామారావు గురువారం నుంచి అన్న ప్రసాద వితరణను గోశాల ఎదుట ఖాళీ స్థలంలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



రద్దీపై ఎప్పటికప్పుడు అంచనా...!

భవానీల రద్దీని అంచనా వేసేందుకు ఈ ఏడాది దేవస్థానం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. భవానీల వాహనాలను నిలిపే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ మార్గంలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు వైర్‌లెస్ సెట్ల ద్వారా మాట్లాడుతూ రద్దీని అంచనా వేశారు. క్యూలైన్‌లో ఎంత మంది భక్తులు ఉన్నారు? వారికి అమ్మవారి దర్శనం అయ్యేందుకు ఎంత సమయం పడుతుంది అంచనా వేస్తూ, ఆలయ ప్రాంగణంతో పాటు ఇరుముడి పాయింట్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు.

అగ్నిప్రతిష్టాపనతో దీక్షల విరమణ ప్రారంభం



దీక్ష విరమిస్తున్న భవానీ మాలధారులు

బుధవారం తెల్లవారుజాము 5.30 గంటలకు ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి అర్చకులు, ఈఓ కె.ఎస్.రామారావు జ్యోతితో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం దిగువన ఉన్న హోమగుండాల వద్దకు చేరుకున్నారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ రామారావు, వైదిక కమిటీ సభ్యులు 6.30 గంటలకు హోమ గుండంలో అగ్నిప్రతిష్టాపన చేయడంతో దీక్షల విరమణ లాంఛనంగా ప్రారంభమైంది. అప్పటికే అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలు ఇరుముడులను సమర్పించి, హోమగుండంలో నేతి కొబ్బరి కాయలు సమర్పించి దీక్షలను పరిసమాప్తం చేసుకున్నారు. భవానీలు, భక్తులకు దేవస్థానం ఉదయం ఏడు గంటల నుంచే అల్పాహారంగా పులిహోర, దద్ధ్యోదనం పంపిణీ చేశారు. ప్రసాదాల పంపిణీని చైర్మన్, ఈఓ ప్రారంభించారు.

సామాజిక ఉద్యమ పితామహులు పూలే దంపతులు

వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: భారతీయ సామాజిక ఉద్యమ పితామహులు పూలే దంపతులు అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'టువార్డ్స్ రియల్ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా: రిలెవెన్స్ ఆఫ్ మహాత్మా జ్యోతిరావు పూలేస్ ఐడియాలజీ అండ్ సోషల్ ప్రాక్టీస్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో వీసీ ప్రసంగిస్తూ పూలే దంపతులు లేకపోతే బ్రిటీష్ పాలనా కాలంలో భారతీయ ఉద్యమాలు, సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపే ఉండేది కాదని చెప్పారు. సమాజ, కుటుంబ వికాసంలో మహిళ విద్య ఆవశ్యకతను గుర్తించి జ్యోతిరావు పూలే తన భార్యకు చదువు నేర్పితే మహిళ విద్యావంతురాలు కావడమే మహిళా వికాసానికి ఏకైక మార్గమని చాటి చెప్పారన్నారు. వారి ఘనకీర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పబ్లిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య జీవీ రమణ కీలకోపన్యాసం చేస్తూ భారతదేశంలో అణగారిన వర్గాల రక్షకుడు పూలే అని వారి కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించకుండా మన సమాజంలో సమ్మిళిత అభివృద్ధిని సాధించడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. కేరళ పాలక్కాడ్ ఏసీటీ అకాడమీ డైరెక్టర్ ఆచార్య సోదామిని మీనన్ ప్రసంగిస్తూ సమాజంలో మనం కోరుకునే ఏ మార్పు అయినా మొదట మన నుంచే రావాలన్నారు. పూలే స్ఫూర్తితో ముందుకుసాగి సామాజిక సాధికారితకు కృషి చేస్తే లక్ష్యం సాధించగలుగుతామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూపరాణి, పాలకమండలి సభ్యుడు విన్నకోట వెంకటేశ్వర్లు, సదస్సు డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య గంగాధర రావు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి నాగరాజు, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఐఎస్‌సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



జాతీయ సదస్సులో సమర్పించే పరిశోధనా పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

చెక్‌పోస్టుల ఏర్పాటుతో గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

జిల్లా మైన్స్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ: ప్రభుత్వం గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాన కూడళ్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిందని జిల్లా మైన్స్ ఏడీ ఆర్.రాజేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ శ్రీనివాస, సత్యకృష్ణ ఇంపీరియల్ గ్రానైట్ క్వారీలను ఆయన పరిశీలించారు. పర్మిట్ లేకుండా, సీనరేజ్ చెల్లించకుండా, అక్రమంగా గ్రానైట్ రాళ్ల తరలించకుండా ఉండేందుకు గానూ ఎగుమతికి సిద్ధంగా ఉన్న బ్లాకులకు నంబర్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్‌కు చెల్లిస్తున్న పర్మిట్‌తోనే గ్రానైట్ రాళ్ల ఎగుమతులు చేపట్టాలన్నారు. అక్రమంగా తరలిస్తే లారీలకు పెనాల్టీ విధించటంతో పాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, దళారీ వ్యవస్థకు కొంతమేర చెక్ పడిందని ఏడీ అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా రామకృష్ణ

బాపట్ల: జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వై.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనతో పాటు డీఆర్‌డీఏ పీడీగా చొప్పర కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఇరువురికి సూచించారు.

బీజేపీ విజయ సంకల్ప యాత్ర

గుంటూరు మెడికల్: బీజేపీ విజయ సంకల్ప యాత్ర బుధవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు వేళంగిని నగర్ వద్ద యాత్రను బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చారని, ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచారన్నారు. భారత్ సంకల్ప యాత్ర దేశ వ్యాప్తంగా వంద రోజులపాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, బీజేపీ నేతలు ఆలపాటి రవికుమార్, చెరుకూరి తిరుపతి రావు, కుమార్‌గౌడ్, పాండురంగ విఠల్, వై.వి.సుబ్బారావు, మంత్రి సుగుణ, దుర్గా భవానీ, మేరి సరోజిని పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

పందెం కోడిపుంజు వేలం

తెనాలిరూరల్: కోడి పందేల శిబిరంపై దాడి చేసిన పోలీసులకు పందెం రాయుళ్లతో పాటు పందెం కోడి చిక్కింది. అయితే పోలీసులు ఆ కోడిపుంజుని వేలం వేస్తే రికార్డు ధర పలికింది. ఇటీవల తెనాలి మండలం తేలప్రోలు, సోమసుందరపాలెం మధ్య కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందేలు వేస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.16,080, ఏడు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు, ఒక పందెం కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. పోలీసులకు చిక్కిన కోడిని మంగళవారం వేలం వేయగా రూ.22,800కు కఠెవరానికి చెందిన గోపి దక్కించుకున్నాడు. వేలంలో వచ్చిన నగదును ప్రభుత్వ ఖానాకు జమ చేయనున్నట్లు ఎస్‌ఐ బుధవారం తెలిపారు.



హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు

నగరంపాలెం: హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ బాపట్ల జిల్లా 4వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బుధవారం అందించిన వివరాలు.. పొన్నూరు మండలం కసుక్రులో 2016లో కుటుంబ కలహాల నేపథ్యంలో అంబటి వెంకటశివశ్రీనివాసరావు తన బావమరిది ఆళ్ల రఘునాథ్‌బాబును దారుణంగా హత్య చేశాడు. ఈ మేరకు పొన్నూరు రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేయగా, అప్పటి సీఐలు బాలసుబ్రహ్మణ్యం, చంద్రమౌళి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాది, బాధితులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, భౌతిక సాక్ష్యాధారాలను సేకరించారు. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. నేరం రుజువు కావడంతో అంబటి వెంకట శివశ్రీనివాసరావుకు శిక్షను ఖరారు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి సీఐ బాలసుబ్రహ్మణ్యం ప్రస్తుతం డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు అధికారి, పొన్నూరు రూరల్ పీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్‌లో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 07089 సికింద్రబాద్- బరంపూర్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 7, 14 తేదీలలో ప్రత్యేక రైలు ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ రైలు సికింద్రబాద్ నుంచి సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరి బరంపూర్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07090 బరంపూర్- వికారాబాద్ రైలు ఈనెల 8,15 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07091 వికారాబాద్- బరంపూర్ రైలు ఈనెల 9, 16 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బరంపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పారు. 07092 బరంపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10, 17వ తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి ఉదయం 6.30 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 08548 శ్రీకాకుళం- వికారాబాద్ రైలు ఈనెల12, 19, 26 తేదీలలో శ్రీకాకుళం నుంచి సాయంత్రం 5 గంటలకు బయలు దేరి వికారాబాద్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుటుందని చెప్పారు. 08548 వికారాబాద్- శ్రీకాకుళం రైలు ఈనెల 13, 20, 27 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8.25 గంటలకు బయలుదేరి శ్రీకాకాళం స్టేషన్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07272 కాకినాడ టౌన్- సికింద్రబాద్ రైలు ఈనెల 13వ తేదీన కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07093 సికింద్రబాద్ -బరంపూర్ రైలు ఈనెల 8,15 తేదీలలో సికింద్రబాద్ స్టేషన్ నుంచి రాత్రి 7.45 గంటలకు బయలు దేరి బరంపూర్ స్టేషన్‌కు మరుసటి రోజు 11.15 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. 07094 బరంపూర్-సికింద్రబాద్ రైలు ఈనెల 9,16 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07251 నరసాపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10వ తేదీ నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 4.50 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07252 రైలు సికింద్రబాద్- నరసాపూర్ రైలు ఈనెల 11వ తేదీన సికింద్రబాద్ స్టేషన్ నుంచి ఉదయం 8.35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏసీఏ ఆంధ్ర, సెంట్రల్ జోన్ అండర్-14 మ్యాచ్‌లు ప్రారంభం

తొలి మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై కృష్ణా విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్-14 అంతర జిల్లాల వన్‌డే క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడగా, కృష్ణా జట్టు 4 వికెట్ల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ప్రకాశం జట్టు 43.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని సుమిత్ 39 పరుగులు చేయగా, కృష్ణా జట్టు బౌలర్లు సంజయ్ 4వికెట్లు, రణధీర్ 2వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 34.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి విజయం సాధించింది. కృష్ణాజట్టు బ్యాట్స్‌మెన్ ఆకర్ష్ అజేయంగా 65 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రకాశం బౌలర్లు గణేష్, రామ్ 2 వికెట్లు చొప్పున సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, రాష్ట్ర జూనియర్ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ సురేష్, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు. కాగా, గురువారం గుంటూరు, ప్రకాశం జిల్లా జట్లు మధ్య రెండవ మ్యాచ్ జరగనుంది.